బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం


ఇంటర్ ఉత్తీర్ణులైన, ఫెయిలైన వారికి జిడిఎ, డిగ్రీ పాసైన వారికి హెల్త్‌కేర్, బిల్లింగ్, పేషెంట్ రిలేషన్ అసోషియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 76809 45357, 79950 13422 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో గల మెడిస్కిల్స్‌ను గానీ సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాడి రైతులకు పరిహారం ఏదీ?

- పశువుల పెంపకందారులకు అందని బీమా డబ్బులు
- రెండున్నరేళ్లుగా ఆగిన పరిహారం చెల్లింపులు
- జిల్లాలో రూ.12.50 కోట్ల మేర బకాయిలు
- ఆందోళనలో పాడి రైతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అటకెక్కించింది. మృత్యువాత పడిన పశువులకు రెండున్నరేళ్లుగా డబ్బులు చెల్లించడం లేదు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశు సంవర్థకశాఖ అధికారుల చుట్టూ పాడి రైతులు తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను మొరపెట్టుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల బారిన పడిన పశుపెంపకందారులను ఆదుకునేందుకు అమలు చేస్తున్న ఈ పథకంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, పాడి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పథకాన్ని నిలిపివేసినట్లు ప్రచారం సాగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.



పాడి రైతులు తమ పశువుల బీమాకు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో, రైతులు సొంతంగా బీమా చేయించుకోలేదు. 2020 నుంచి ఈ పథకం ద్వారా ఎవరికీ లబ్ధి చేకూరడం లేదు. పశువుల బీమా ఉంటే మేలుజాతి పశువు మృతి చెందితే రూ.30 వేలు, సాధారణ రకమైతే రూ.15 వేలు చెల్లిస్తారు. పశువు మృతి చెందిన 24 గంటల్లో రైతు పశు వైద్యాధికారికి సమాచారం ఇస్తే, 48 గంటల్లో పోస్టుమార్టం పూర్తి చేసి ఆపై సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసేవారు. పశుసంవర్థకశాఖ డీడీ, ఎడి, ఇద్దరు పశు వైద్యుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసేవారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత అధికారులు ఆమోదం తెలిపేవారు. ఈ పథకానికి సంబంధించి జిల్లాలో రూ.12.50 కోట్ల బకాయిలు ఉన్నాయి.

రెండున్నరేళ్లుగా అందని నష్టపరిహారం

వైఎస్సార్ పశు బీమా పథకం అమలుకు ముందు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు నష్ట పరిహారం పేరుతో 2019 నుంచి అమలు చేసింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మృత్యువాత పడిన పశువులకు ఎటువంటి డబ్బులు తీసుకోకుండానే పరిహారం కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. తొలుత కొంతమందికి డబ్బులు చెల్లించినా, మిగిలిన వారికి రెండేళ్లుగా డబ్బులు చెల్లించడం లేదు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 4,458 పశువులకు రూ.12.50 కోట్లను చెల్లించాల్సి ఉంది. 2021 జూన్ నుంచి పరిహారం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.

తాము బిల్లులు పంపినా రిజర్వు బ్యాంకు కొర్రీలతో క్లియరెన్స్ కావడం లేదని అధికారులు చెప్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో, రెండున్నరేళ్లుగా రైతులు పరిహారానికి నోచుకోవడం లేదు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్థకశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను మొరపెట్టుకుంటున్నారు. కొత్తగా పశువుల కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

క్లయిమ్‌లను పరిష్కరించాలని పశుపెంపకందారులు, రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, రైలు, రోడ్డు ఇతర ప్రమాదాలు, ఇతర వ్యాధుల బారిన పడి వేలాది పశువులు మృత్యువాత పడ్డాయి. కొత్తగా పశువుల కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు. కనీసం ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చినా కొంతమేర ఉపయోగపడేవని రైతులు వాపోతున్నారు. మండలాల్లోని వెటర్నరీ ఆస్పత్రులు, పశుసంవర్థకశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారం చెల్లింపులు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

వెంటిలేటర్‌పై వైసిపి ప్రభుత్వం

- వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయం
- నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు అవస్థలు
- యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలి
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వం వెంటిలేటర్‌పై ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని చెప్పారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో యువగళం ముగింపు సభ ఏర్పాట్లపై పార్టీ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. సంక్షేమం పేరిట ధరలు, పన్నులు, ఛార్జీలు పెంచి ప్రజలపై పెను భారాన్ని మోపారని విమర్శించారు. వైసిపి పాలనపై విసిగి వేశారిన ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, వైసిపిని ఎప్పుడు సాగనంపుదామా అని ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఓటమి భయంతో జగన్ అభ్యర్థుల నియోజకవర్గాలను మార్చుతున్నారని, ఒక నియోజకవర్గంలో చెల్లని వారు మరో నియోజకవర్గంలో చెల్లుతారా అని ప్రశ్నించారు. ప్రజల భవిష్యత్‌కు భరోసా ఇస్తున్న చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

యువగళం సభను విజయవంతం చేయాలి

ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకునేందుకు, వారికి భరోసానిచ్చేందుకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారని తెలిపారు. ఈనెల 20న విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నిర్వహించ తలపెట్టిన యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి నియోజకవర్గం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ఈ సభకు తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు.

ఓటమి భయం వెంటాడుతోంది

జిల్లా పరిశీలకులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజల్లో మార్పు అనివార్యమన్న భావన వ్యక్తమవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని పలు సర్వేల ఫలితాలు జగన్‌కు వచ్చాయని, ప్రజలను మాయ చేసేందుకు వైనాట్ 175 అంటూ డాంబికాలు పలుకుతున్నారన్నారు. జగన్‌కు ఓటు ఎందుకు వేయకూడదో ప్రజలు నిర్ణయించుకున్నారని, దీనివల్లే కొన్ని నియోజకవర్గాల్లో ఓడిపోతామన్న భయం నాయకుల్లో వ్యక్తమవుతోందన్నారు. టిక్కెట్లు ఇచ్చినా ఓడిపోతామన్న భయంతో ఆ పార్టీలో కొందరు నాయకులు వెనకడుగు వేస్తున్నారని చెప్పారు. అవినీతి సొమ్మును పంచి గెలవాలన్న ప్రయత్నంలో జగన్ ఉన్నారని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలను కోరారు. తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర పరిశీలకులు దామచర్ల సత్య, బీర రవిచంద్ర, ఎమ్మెల్యే బెందాళం అశోక్, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు గుండ లక్ష్మీదేవి, గౌతు శిరీష, కలమట వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్, మొదలవలస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రచనలతోనే సామాజిక సంస్కరణలు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సామాజిక సంస్కరణలు రచనలతోనే సాధ్యమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో కళింగాంధ్ర సాహిత్య సమాలోచనపై విశ్లేషణ అనే అంశంపై ధర్మాన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఇందులో భాగంగా విద్యావేత్త నిక్కు అప్పన్న రచించిన 'గేయ సుధా బిందువులు' , అయ్యగారి సీతారత్నం రచించిన 'స్కాలర్', కొంచాడ మల్లికేశ్వరరావు రచించిన 'తూర్పుతీరంలో తెలుగు రేఖలు', డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించిన 'గురజాడ.. మరికొన్ని వ్యాసాలు' పుస్తకాలను ఆవిష్కరించారు. ఇటీవల వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్న తప్పెటగుళ్ల కళాకారుడు కోన సన్యాసి, రంగస్థల కళాకారుడు యడ్ల గోపాలరావు, సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడును మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యంపై ఇలాంటి సమాలోచనలు ఎప్పటికప్పుడు చేసేందుకు ఆస్కారం ఉంటేనే కొత్త వారికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తద్వారా గొప్ప రచనలను ఆదర్శంగా తీసుకొని నేటి రచయితలు స్ఫూర్తి పొందుతారని చెప్పారు. కళింగాంధ్రలో ఉండే సాహిత్యానికి సంబంధించి సంబంధిత వేదిక ఏర్పాటుకు ఎప్పుడైనా ముందుంటానని హామీ ఇచ్చారు. అనేక కోణాల్లో విషయాలను విశ్లేషించి తెలియజేసే వాళ్లు రచయితలు అని, వారే ఈ సమాజ మార్పుకు కారణమయ్యే రచనలు చేయాలని పిలుపునిచ్చారు. గురజాడ స్ఫూర్తితో రచనలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాటక రచయిత, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ అధ్యక్షతన వహించిన సదస్సులో గుర్రం జాషువా పురస్కార గ్రహీత నల్లి ధర్మారావు, స్వామి వివేకానంద జాతీయ అవార్డు గ్రహీత గురుగుబెల్లి లోకనాథం, గుమ్మా నగేష్, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు, బలగ గణపతి పట్నాయక్, మండవిల్లి రవి, టంకాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

64 పాఠశాలల్లో సిబిఎస్ఇ తరగతులు

- సిబిఎస్ఇ బోర్డు పరిధిలోకి పాఠశాలలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్





పేద విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్యా బోధనకు ప్రభుత్వ పాఠశాలల్లో సెంట్రల్ బోర్డు ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సమగ్ర శిక్ష అభియాన్ అదనపు సమన్వయకర్త డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. తొలివిడతగా రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సిలబస్ ప్రారంభం కానుందన్నారు. జిల్లాలో సిబిఎస్ఇ కోర్సును వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడానికి 64 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సిబిఎస్ఇ కోర్సుల నిర్వహణకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పలు అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు.

సిబిఎస్ఇ సిలబస్ బోధనకు ఎలాంటి చర్యలు చేపట్టనున్నారు?

జిల్లాలో స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యాబోధన ఇప్పటివరకు అందుబాటులో ఉంది. ఆంగ్ల విద్యను రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నాం. ఎస్ఎస్‌సి బోర్డు పరిధిలోనే పరీక్షల నిర్వహణ జరుగుతోంది. విద్యార్థులకు జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన అందించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రవేశపెట్టిన సిబిఎస్ఇ కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ సిలబస్ ద్వారా నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం. ఆ దిశగా జిల్లాలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 64 పాఠశాలల్లో సిబిఎస్ఇ విద్యా బోధన జరుగనుంది.

ఈ కోర్సుల వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరుతుంది?

రాష్ట్రస్థాయిలో స్కూల్ ఎడ్యుకేషన్ విధానం అమల్లో ఉంది. దీనివల్ల తెలుగు, ఇంగ్లీషు మీడియం స్కూళ్లను మాత్రమే నిర్వహిస్తున్నాం. జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించడానికి సిబిఎస్ఇ సిలబస్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఆంగ్ల భాషలో విద్యా బోధనతో పాటు జాతీయ ప్రమాణాలు కలిగి ఉండడంతో విద్యార్థికి మేలు చేకూరుతుంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో సిబిఎస్ఇ బోర్డు ఉన్నతాధికారులు స్కూళ్లను ఎంపిక చేశారు. జాతీయస్థాయిలో ఈ పాఠశాలలు అనుసంధానం కావాల్సి ఉంటుంది. బోర్డు పరిధిలోనే జాతీయ స్థాయిలో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఆ దిశగా విద్యార్థులను తయారు చేయడానికి బోధనాంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇస్తారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి?

ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు ఇప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. పెద్దఎత్తున ప్రభుత్వం నిధులు ఇవ్వడంతో కార్పొరేట్‌స్థాయిలో వసతులు సమకూర్చాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం, భవనాల మరమ్మతులు, రంగులు మార్చడం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, విద్యార్థులు కూర్చునేందుకు అనువైన బెంచీలు, గదుల్లో స్క్రీన్లు, ఫ్యాన్ల సదుపాయాలను సమకూర్చాం. పాఠశాలలో తరగతి గదిలో చదుకునే విద్యార్థులకు శ్రద్ధను పెంచడానికి తోడ్పడింది. ఇప్పుడు తనకు నచ్చిన కోర్సును చదువుకునేందుకు వీలుగా ఆంగ్ల బోధన, సిబిఎస్ఇ తరగతులు నిర్వహిస్తున్నాం. వారి ఆసక్తిని బట్టి ఈ కోర్సుల్లో దేనినైనా ఎంచుకునే అవకాశం ఉంటుంది. విద్యాబోధన, సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవడంతో చదువుపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది.

కవితలకు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పరవస్తు చిన్నయసూరి 217 జయంతి సందర్భంగా కవితలను ఆహ్వానిస్తున్నట్లు చిన్నయ్యసూరి సాహితీ పీఠం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి విజయ్ లక్ష్మణ్, ఈవేమన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవితలు చిన్నయసూరి జీవిత విశేషాలపై ఉండాలని తెలిపారు. కవితలను ఈనెల 19వ తేదీలోగా 9052344684 నంబరుకు పంపాలని పేర్కొన్నారు. 20న సాయంత్రం ఐదు గంటలకు శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ కార్యదర్శి కుమార్ రాజు సమక్షంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరో రోజు... ఆగని జోరు

- ఉధృతమవుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె
- కళ్లు, చెవులు, నోరు మూసుకొని నిరసన
- నేడు ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు
- సమ్మెకు మద్దతు తెలుపుతున్న అంగన్వాడీ లబ్ధిదారులు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతమవుతోంది. ఆదివారానికి సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. ఆరు రోజులుగా అంగన్వాడీలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి కనిపించడం, వినిపించడం, మాట్లాడడం లేదని కళ్లు, చెవులు, నోరు మూసుకొని వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ఎన్నిరకాలుగా ప్రయత్నిస్తున్నా, అంగన్వాడీలు మాత్రం ఐక్యతతో సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నారు. తామేమీ కొత్తగా డిమాండ్లు చేయడం లేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇస్తామన్న హామీలనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మరోవైపు సమ్మెకు మద్దతు పెరుగుతోంది. అంగన్వాడీ లబ్ధిదారులు పిల్లలతో కలిసి సమ్మె శిబిరాల వద్దకు వచ్చి సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్నారు. పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారు.



శ్రీకాకుళం అర్బన్ : చెవులు, కళ్లు, నోరు మూసుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

న్యాయమైన అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు కళ్లు, చెవులు, నోరు మూసుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి ప్రభుత్వమే చట్టాలను ఉల్లంఘిస్తోందని విమర్శించారు. అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని, బెదిరింపులు మానుకొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు తగ్గట్టు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఈనెల 18న ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి, ఇ.అప్పలనరసమ్మ, జి.రాజేశ్వరి, కృష్ణభారతి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరానికి పిల్లలతో కలిసి అంగన్వాడీ లబ్ధిదారులు వచ్చి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హైమావతి, బాలామణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోంపేట, కోటబొమ్మాళి ప్రాజెక్టు కార్యాలయాల వద్ద చేపట్టిన సమ్మె శిబిరాల్లో పిల్లలతో కలిసి అంగన్వాడీ లబ్ధిదారులు వచ్చి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో తమ పిల్లలతో కలిసి అంగన్వాడీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, కృష్ణవేణి, రమ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో కాశీబుగ్గ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సమ్మె శిబిరానికి వచ్చిన సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, ప్రజా కళాకారులు కె.హేమసూదన్, కె.బాలాజీరావు తదితరులు సంఘీభావం తెలిపారు. కళాకారులు ఉద్యమ గీతాలను ఆలపించి అంగన్వాడీల్లో స్ఫూర్తిని రెట్టింపు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : పిల్లలతో కలిసి సంఘీభావం తెలుపుతున్న అంగన్వాడీ లబ్ధిదారులు



కోటబొమ్మాళి : సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న అంగన్వాడీ లబ్ధిదారులు



సోంపేట : సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న అంగన్వాడీ లబ్ధిదారులు



పొందూరు : పిల్లలతో కలిసి సంఘీభావం తెలుపుతున్న అంగన్వాడీ లబ్ధిదారులు

పెన్షన్ విశ్రాంత ఉద్యోగుల హక్కు


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దశాబ్దాల తరబడి దేశాభివృద్ధిలో భాగస్వాములై సేవలందించిన ఉద్యోగికి తన ఉద్యోగ విరమణ అనంతరం గౌరవ ప్రదంగా శేష జీవితం గడిపేందుకు పెన్షన్ అవసరమని, అందువల్ల పెన్షన్ హక్కును పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో పెన్షనర్ల అండ్ విశ్రాంత పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన అంతర్జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు విశ్రాంత ఉద్యోగులకు హానికలిగించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ దయా, భిక్ష కాదని, విశ్రాంత ఉద్యోగుల హక్కు అని సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తుచేశారు. అతితక్కువ పెన్షన్‌తో ఇబ్బంది పెడుతున్న ఇపిఎస్ విశ్రాంత ఉద్యోగులు వృద్ధాప్యంలో తప్పని సరై ప్రయివేటు సంస్థల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగుల నాయకులు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ భవిష్యత్‌లో అన్ని విశ్రాంత ఉద్యోగ సంఘాలు ఐక్య పోరాటం చేయాల్సిన ఆవశ్యకత పెరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర, ప్రయివేటు సంస్థల విశ్రాంతి ఉద్యోగులు ఇందులో భాగస్వాములు కావాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పెన్షనర్ల న్యాయమైన పోరాటాలకు తమ మద్దతు ఉంటుందన్నారు. సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగుల పక్షాన పోరాడుతున్నట్లు గుర్తు చేశారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ పెన్షన్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను సమావేశంలో ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణమూర్తి, ఎల్.అనంతరావు, ఎ.సత్యనారాయణ, శ్రీనివాసరావు, కె.రాజగోపాలరావు, ధర్మరాజు, ఎ.నర్సింగరావు నాయకత్వం వహించారు. అనంతరం ఉషా డెంటల్ ఆధ్వర్యాన పెన్షనర్లకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ పొందుతున్నారంటే నాటి ధరంసింగ్ నకారా పోరాట ఫలితమేనని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. నకారా జయంతిని పురస్కరించుకుని అనురాగ నిలయంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, జిల్లా అధ్యక్షులు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, ట్రెజరీశాఖ డిప్యూటీ డైరెక్టర్ సి.రవికుమార్ నరసింహమూర్తి, సోమసుందరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా కళింగ వైశ్య భవన్‌లో నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని, వాళ్ల సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు. అనంతరం సూపర్ పెన్షనర్స్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ రవికుమార్, సైనా సంఘం ఛైర్మన్ డివి దేవ, సీనియర్ సిటిజన్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుజాత, వివిధ సంఘ అధ్యక్షులు నేతింటి రామారావు, బెజవాడ రామారావు, శ్యామ్, హేమ సుందర్, సత్యనారాయణ, కూన తవిటి నాయుడు, విశాఖ గ్రామీణబ్యాంకు రీజన్ మేనేజర్ అనంతరావు, విశాఖ గ్రామీణ బ్యాంకు మాజీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటి: మలిదశలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు అండగా నిలవాలని విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు జి.జానకిరామయ్య, పి.డిల్లేషు, పూడి భీమారావు కోరారు. విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముందుగా తమ ఆద్యుడు డిఎస్ నాఖార విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పెండింగులో ఉన్న 185 నెలలకు సంబంధించిన డిఎ, పిఆర్‌సి ఎరియర్స్ విడుదల చేయాలని కోరారు. అలాగే తమ సంఘంలోని సభ్యులైన పిరియ కృష్ణారావు, పండి బలరామ్మూర్తి, జన్నెల ప్రసాదరావు, దండాసి రౌలో, మోగిలిపురి సింహాచలంను ఘనంగా సన్మానించారు.


కవిటి : కృష్ణారావును సన్మానిస్తున్న పెన్షనర్లు

పలాస : కాశీబుగ్గ కన్యకా పరమేశ్వరి ఆలయ కళ్యాణ మండపంలో అఖిల భారత పిన్షనుదారుల సంఘం ఆధ్వర్యాన 18 మంది విశ్రాంత ఉద్యోగులకు ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు తమ్మినాన మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశం పలాస సబ్ ట్రెజరీ అధికారి లక్ష్మీపురం రామారావు, పూర్వ అధ్యక్షులు పైల సూర్యనారాయణ మాస్టారు, సెక్రటరీ నెమలిపురి అప్పారావు, జనరల్ సెక్రటరీ బి.నరసింగరావు, టి.వి.రెడ్డి మస్టారు, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, బూరెల జగ్గారావు, తమ్మినేని కుశరాజు, సుందరరావు, తమ్మినేని వైకుంఠరావు, భగీరథ పాణిగ్రహీ, బి.దొర, హనుమంతు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వ హైస్కూల్‌లో పెన్షన్లను సన్మానించారు. ముందుగా డిఎస్ నకారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి రూరల్ : పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని ఎస్‌టిఒ భాగ్యలక్ష్మి అన్నారు. అఖిల భారత పెన్షనర్ల దినోతసవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హోమియో, దంత, నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి కె.ధనుంజయరావు, కోశాధికారి బి.అయ్యబాబు, జి.వెంకటరెడ్డి, దల్లి వీరాస్వామి పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలో ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన పెన్షనర్ల సంఘ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌ట్రెజరీ ఆఫీసర్ ఎస్.సువర్ణ రాజు, సంఘ గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, స్టేట్‌బ్యాంక్ చీఫ్ మేనేజర్ అనంత నారాయణమూర్తి పాల్గొన్నారు. సభలో 14 మంది సీనియర్ పెన్షనర్లకు ఎస్‌టిఒ చేతుల మీదగా సన్మానం చేశారు.


రణస్థలం : మాట్లాడుతున్న నరసింహులునాయుడు


శ్రీకాకుళం : డి.పి దేవ్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు

పొందూరు: స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవం సందర్భంగా సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పెన్షన్‌దారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, విశ్రాంత ఉద్యోగుల ప్రాంతీయ సంఘం కార్యదర్శి పి.సూర్యప్రకాశరావు, దండా సూరిబాబు, బి.సూర్యనారాయణ, వి.వి.గోపాలరావు పాత్రో, వై.అప్పలరాజు, కూన కృష్ణారావు, బొడ్డేపల్లి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత పెన్షన్‌దారుల ఉద్యమనేత దివంగత డిఎస్.నకరా చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

రణస్థలం: పెన్షన్స్ డే సందర్భంగా రణస్థలంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు నాయుడు, పాపి నాయుడుతో పాటు టిడిపి నేత కలిశెట్టి అప్పలనాయుడు, పెన్షనర్ల సంఘం ప్రతినిధులు బాలి రామునాయుడు, మేడూరి సత్యనారాయణ, మన్నె కృష్ణానందం, పొన్నాడ సత్యనారాయణ, రెడ్డి లక్ష్మణరావు, వెంకటరమణ, సిహెచ్ గోపాలరావు, మాడుగుల రామారావు, మీసాల సీతంనాయుడు, వెంకటస్వామి పాల్గొన్నారు.



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న పెన్షనర్లు

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలు మృతి

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరానికి ఎం.సరోజినమ్మ (70) శనివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో మృతి చెందింది. సరోజనమ్మ భర్త చనిపోవడం, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో అన్నదమ్ముడు ఉన్నారు. 11 గంటల సమయంలో వంట చేస్తుండగా దుస్తులకు మంటలు అంటుకుని శరీరం మొత్తం కాలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సి కె.మునేశ్వర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురికి గాయాలు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ సమితి సియాలి సమీపంలో ఆదివారం చెట్టుకు కారు ఢీకొనడంతో డ్రైవర్, సునీత పతి, శామ్యూస్ పతి, సుమిత్ పత్రిలు గాయపడ్డారు. అగ్నిమాపక విభాగం విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకొని వారిని కాశీనగర్ సమూహ ఆస్పత్రిలో చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం రాయగడ జిల్లా సమూహ ఆస్పత్రికి తరలించారు.


బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సచివాలయ సిబ్బంది

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గరుడభద్రలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్కుపల్లి సచివాలయ పంచాయతీ కార్యదర్శి లండ రాజేష్, డిజిటల్ అసిస్టెంట్ రాజేష్, వాలంటీర్ బాలకృష్ణ పట్టుకున్నారు. శనివారం రాత్రి అక్కపల్లి నుంచి ఓ వ్యక్తి రహస్యంగా బియ్యం అక్రమంగా తరలించినట్లు సమాచారం అందిందని తెలిపారు. దీంతో ఆదివారం గరుడుబద్రలో తనిఖీలు చేపట్టి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. సుమారు వంద కిలోల బియ్యం ఉంటుందని అన్నారు.


పురస్కారాన్ని అందుకుంటున్న కుమార్ నాయక్

కుమార్ నాయక్‌కు పురస్కారం

ప్రజాశక్తి- పలాస

చతీష్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్ జిల్లా భిలాయి జగన్నాథ భవన్ సెక్టార్ వద్ద భిలాయి వాణి 27వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సినీ నటుడు డాక్టర్ కుమార్ నాయక్‌కు భిలాయి వాణి పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. జానపద కళలు, వాటి మనుగడపై కృషి చేసినందుకు గాను ఇటీవల డాక్టరేట్ కుమార్ నాయక్ అందుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు లండ రుద్రమూర్తి, కార్యదర్శి సాగూరు నారాయణస్వామి, మురిపెల్లి బాబూరావు, ప్రగతిశీల లేఖ సంఘం జాతీయ అధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, జనవాది సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు పరదేశి రామ్ వర్మ, ప్రవాసాంధ్ర తెలుగు థియేటర్స్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొన్నారు.


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గణితంపై ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 22న జరగనున్న జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రెండు కేంద్రాల్లో ప్రతిభా పరీక్ష నిర్వహించామని సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్షులు గోపీకృష్ణ, కార్యదర్శి ఈటి నాయుడు తెలిపారు. ఆరో నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితంపై ఆసక్తిని, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఈ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. నగరంలోని శ్రీచైతన్య సహకార జూనియర్ కళాశాలలో 274 మంది, ఆమదాలవలసలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 588 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి హాజరయ్యారని చెప్పారు. సిక్కోలు చేయూత సేవా సంఘం ఆవిర్భావం నుంచి విద్యాపరమైన, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆర్థికంగా వెనుక బడిన విద్యార్థులకు చేయూత నివ్వడం, పేదలకు ఆపన్నహస్తం అందించడం చేస్తోందన్నారు. ప్రతిభా పరీక్షలు నిర్వహించడం ద్వారా గణితంలో ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి గణిత దినోత్సవం రోజున జరిగే కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామని ప్రకటించారు.

రాజకీయం వ్యాపారం కాకూడదు

శ్రీకాకుళం అర్బన్ : రాజకీయం వ్యాపారం కాదని, కేవలం సంఘసేవని గుర్తించిన నాడే నిజమైన రాజకీయ వేత్తలు కాగలరని ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. ఆదివారం నగరంలో పెద్దరెల్లివీధిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం జై భీమ్ శబరి పవర్ జిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో యువత భాగస్వాములు కావాలని, నిజాయితీతో సేవలందించాలని కోరారు. సమాజానికి అంబేద్కర్ చూపించిన మార్గం ఎప్పటికీ ఆదర్శమన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు నిరూపమానమన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్ జ్యోతి ప్రసాద్, వేణు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీధర్

వైసిపి ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో రాజ్యలక్ష్మి!

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో నెలకో పేరు మార్మోగుతోంది. తాజాగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పలాస పర్యటన తర్వాత ఒక్కసారిగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేర్లు వినిపిస్తున్నాయి. అందులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పేరు హల్‌చల్ చేస్తున్నాయి. ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహి స్తున్న పిరియా సాయిరాజ్ ఇవేవీ పట్టించుకోకుండా పార్టీ అప్పగించిన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తిచేస్తున్నారు. ఇదే నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలు విడువక నియోజకవర్గంలో కులాలు ప్రస్తావన తెరపై తీసుకొచ్చారు. దీంతో ఆశావహుల్లో యాదవ సామాజిక తరగతికి ఎమ్మెల్సీ పదవి రావడంతో టిక్కెట్ రేసులో వెనుక పడినట్లేనని చెప్పారు. ఇక మిగిలిన ప్రధానమైన రెడ్డిక సామాజిక వర్గానికి చెందిన పిలక రాజ్యలక్ష్మి పేరు ప్రస్తావనకు తెచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయం గోప్యంగా ఉండాలని పెద్దలు సూచించినట్లు సమాచారం. అయినప్పటికీ రాజ్యలక్ష్మి పేరు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. జిల్లాస్థాయి నాయకులు సాయిరాజ్‌కు చెక్ పెట్టేందుకు కొత్త పేర్లు తెరపైకి తెస్తున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. మరో వైపు అధిష్టానం ఒక్కోసారి ఒక పేరు బయట పెడుతూ రహస్య సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరికి సర్వేలో అనుకూలంగా లేవు... అందుకే ఈ సారి ఎన్నికలో టిక్కెట్ ఫలానా వ్యక్తికి ఇవ్వాల్సి వస్తోందని స్పష్టం చేయనున్నట్లు తెలుస్తోం ది. ఇచ్ఛాపురం టిక్కెట్ విషయం ముందుగా సాయిరాజ్ కుటుంబానికే అని ప్రచారం ఉంది. అప్పుడు సొంత పార్టీ నేతలే ఒకే కుటుంబానికి ఇన్ని పదవులా? అని ఫిర్యాదులు చేశారు. ఆ తరువాత ఆర్థికంగా బలంగా ఉన్న మారిటైమ్ బోర్డు ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి పేరు తెరపైకి తీసుకొచ్చారు. అప్పుడు వెంకటరెడ్డి స్థానికేతరుడు అని ముద్ర వేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం గత చరిత్ర పరిశీలిస్తే, వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే ఎన్నికైన కీర్తిశేషులు ఎం.వి.కృష్ణారావుకు ఓటర్లు అండగా నిలిచారు. అదేబాటలో కాయల వెంకటరెడ్డికి కూడా టిక్కెట్ ఇస్తే అన్ని తరగతుల ఓటర్ల మద్దతు ఉంటుందని పార్టీ పెద్దల ఆలోచనలు. మొత్తం మీద ఇచ్ఛాపురం వైసిపి ఎమ్మెల్యే టిక్కెట్ ఉత్కంఠగా మారుతుంది.

'పది' మోడల్ పేపర్లు విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి ఏటా 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు యుటిఎఫ్ సామాజిక బాధ్యతతో మోడల్‌పేపర్లను అందిస్తోందని డిప్యూటీ డిఇఒ విజయకుమారి పేర్కొన్నారు. నగరంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆమె చేతులమీదుగా పదవ తరగతి 2024 మోడల్ పేపర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఆధ్వర్యాన రూపొందించిన ఎస్-ఎస్‌సి 2024 మోడల్ టెస్ట్ పేపర్లను నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులచే రూపొందించినట్టు తెలిపారు. 7 పేపర్లను పాట్రన్ అండ్ ఎగ్జామ్ ఓరియెంటెడ్‌లో రూపొందించినట్టు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 18 నుంచి జరిగే కామన్ పరీక్షలు దృష్ట్యా అన్నిస్థాయిల విద్యార్థులకు ఉపయోగపడే మోడల్ టెస్ట్ పేపర్లు ఉత్తీర్ణతకి అనుకూలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శులు హెచ్ అన్నాజీరావు, జి.సురేష్, పి.సూర్యప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం.వాగ్దేవి, పి.అప్పారావు, జిల్లా నాయకులు కె.వెంకట్రావు, జి.జనార్ధనరావు పాల్గొన్నారు.


మోడల్ పేపర్లను విడుదల చేస్తున్న విజయకుమారి

క్రికెట్ పోటీలకు ఆహ్వానం

కవిటి: మండలంలో డి.జి.పుట్టుగలో రాబోయే సంక్రాంతి సందర్భంగా జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రతిభ యువజన సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆసక్తి ఉన్న జట్లు డిసెంబరు 20 నుంచి జనవరి 1 లోగా తమ జట్టు వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.20 వేలతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.12 వేలతో పాటు ట్రోఫీ అందిస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 7093109849, 9014887374 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న చింతాడ రవికుమార్

ఎన్ఆర్ఐ రాంకీ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాక గ్రామంలో దుబాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న కొంచాడ రామకృష్ణ ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ రాంకీ టాలెంట్ అవార్డ్స్-2023 ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆదర్శ రైతులు, వివిధ సామాజిక రంగాల్లో ప్రతిభ కనపర్చిన వారికి, కొత్తగా ఉద్యోగాలను పొందిన వారికి ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, జానపద కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో సువ్వారి గాంధీ, చింతాడ రవికుమార్, పిసిని చంద్రమోహన్, ఆనెపు రామకృష్ణ, రేలారే రేలా రఘు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపి మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇచ్ఛాపురం మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్‌ను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇచ్ఛాపురం వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సుల్తాన్ అన్నారు. తనపై నమ్మకంతో తనకు పదవి ఇచ్చినందుకు సిఎం వై.ఎస్.జగన్ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయకు కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న ఎన్ఇఆర్

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

రణస్థలం రూరల్: అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) పేర్కొ న్నారు. ఆదివారం మండలంలో వెంకటరావుపేట సమీపంలో ఎపి దళిత మహాసభ ఏర్పాటు చేసిన సదస్సులో దేశరాజకీయ పరిస్థితులు, బహుజనుల పాత్ర అన్న అంశంపై మాట్లాడుతూ సంఘంలో వెనుకుబాటు తనం అనే దాన్ని దూరం చేయడానికి ఉన్న ఏకైక మార్గం చదువు ఒక్కటేనని, రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని అన్ని రంగాల్లో రాణించడానికి బహుజనులు కృషి జరపాల న్నారు. కార్యక్రమంలో దేబారికి రాము మాస్టర్, ముక్కు ఆదినారాయణ, కుసుమ, నాయకులు పాల్గొన్నారు.

వైసిపి మహిళా విభాగ జిల్లా కార్యదర్శిగా తిరుమల మానస

ప్రజాశక్తి- రణస్థలం రూరల్


తిరుమల మానస

మండలంలో వల్లభరావుపేట గ్రామానికి చెందిన గురాన తిరుమల మానస వైసిపి మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమె గత కొంతకాలంగా రణస్థలం మండలం వైసిపి మహిళా అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆమె పార్టీలో చురుగ్గా పనిచేస్తూ అందరిని కలుపుకొని వెళ్లడంతో పార్టీ జిల్లా బాధ్యతలు అప్పగించింది. ఈ అవకాశం తనకు వచ్చేందుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మానసకు స్థానిక నాయకులు గురాన చిరంజీవి, మహంతి సత్యనారాయణ, పాలూరి బుజ్జి, గడి రమణ, రామకృష్ణ అభినందలు తెలిపారు.

24న నియోజకవర్గ టాలెంట్ పరీక్ష

పలాస: మండలంలోని రంగోయిలో ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన ఈ నెల 24న పదో తరగతి విద్యార్థులకు నియోజకవర్గం స్థాయి ప్రతిభా పరీక్ష, విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక అధ్యక్షులు ఇసాకోట జోగారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు తెలిపారు. మండలంలోని నీలావతిలో గ్రంథాలయం వద్ద ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రంథాలయ నిర్మాణ కమిటీ కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు, గౌరవ ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ, ఆర్థిక కార్యదర్శి ఎంపల్లి కామేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు కుత్తుం సుధాకర్, పూర్వ అధ్యక్షులు తెప్పల వాసుదేవరావు, అకాడమిక్ సెల్ కన్వీనర్ పి బాలరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

పలాస : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అరాచక పాలన కొనసాగుతోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో వార్డు పద్మనాభపురం, జయరామ చంద్రపురం, పెంటిభద్ర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి మేనిఫోస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు. అనంతం సుమారు 125 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరాయి. వారికి శిరీష టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజులు నియోజకవర్గంలోని కొండలను, గుట్టలను మింగేస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ రోడ్డు మూడేళ్ల కావస్తున్నా ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, కృష్ణారావు, బి.నాగరాజు, కొండే నర్సింహులు, సారా నెక్కులురావు, రోజా, రామారావు, మౌనిక, కసమ్మ, రామారావు, గంగమ్మ, కృష్ణ, సంకరవు తిరుపతి, మదన్, బలమ్మ పాల్గొన్నారు.


పార్టీలో చేరిన నాయకులతో గౌతు శిరీష

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టపురం, చీపుర్లపాడు, కోటబొమ్మాళి, తిలారు, సరియాపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫోస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు.

దుర్గ్ రైలును పలాస వరకు పొడిగించాలి

ప్రజాశక్తి- పలాస

బిలాయి నుంచి వస్తున్న దుర్గ్ రైలు విజయనగరం వరకే వస్తుందని, ఆ రైలును పలాస వరకు పొడిగించాలని ఆంధ్ర ఉత్కల్ సంఘర్ష సమితి (బిలాయ్) అధ్యక్షులు కర్రి ఉమా శంకర్ కోరారు. బిలాయిలో ఎంపీ విజయ్ బద్వేల్‌ను తన స్వగృహంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యాన ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దాన కోస్తా తీర ప్రాంత ప్రజలు వారి జీవన భృతి కోసం బిలాయిలోనే బతుకుతున్నారని అన్నారు. అందుకు పలాస నుంచి బిలాయి వెళ్లేందుకు అవస్థలు పడుతున్న దృష్ట్యా దుర్గ్ రైలును పలాస వరకు పొడిగించాలని కోరారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్‌నాయక్, కళాంజలి కల్చరల్ సంస్థ (బిలాయ్) వ్యవస్థాపకులు కొవిరి రాజుబీ, యువజన సంఘ నేతలు బర్రి జోగారావు, పిట్ట దుర్యోధన, వంక రాజారావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

విద్యుత్ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోపాలరావు


గోపాలరావు

శ్రీకాకుళం అర్బన్ : విద్యుత్‌శాఖలో 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.వి గోపాలరావు ఎన్నికయ్యారు. గతంలో జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన ఆయనను ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయిలో కార్యవర్గ సమావేశాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా కృష్ణయ్య ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర నాయకులను సోమవారం నరసన్నపేట మేఘన కన్వెన్సన్‌లో సన్మానం నిర్వహిస్తున్నట్టు సంఘం నాయకులు తెలిపారు.

యువగళం సభతో వైసిపికి వణుకు


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

లావేరు : యువగళం పాదయాత్ర ముగింపు సభతో వైసిపి గుండెల్లో వణుకు మొదలైందని, సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కిమిడి కళావెంకటరావు అన్నారు ఆదివారం మండలంలో సుభద్రపురంలో కళా వెంకటరావు అధ్యక్షతన ఈనెల 20న భోగాపురం మండలం పోలిపల్లిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేసేందుకు సన్నాహక సభకు లావేరు మండల పార్టీ నాయకులతో ఏర్పాటు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ప్రధాన కార్యదర్శి పి.మధుబాబు, ఆర్.ప్రకాశరావు, దారపురెడ్డి కూర్మరావు, చిక్కాల ఎల్లందొర పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా...

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన భావనపాడు, మేఘవరం, సున్నాపల్లి ప్రాంతమంతా సందర్శకులతో ఆదివారం సందడి నెలకొంది. విహారి యాత్రికులు, యువత, మహిళలు కేరింతలతో తీర ప్రాంతం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో వచ్చిన యాత్రికులు తోటలలో సేదతీరి, సముద్ర స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. వయసుతో సంబంధం లేకుండా ఆటలతో, పాటలతో కేరింతల కొడుతూ సందర్శకులు ఉల్లాసంగా గడిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నౌపడ పోలీసులు, భావనపాడు మెరైన్ పోలీసులు సంయుక్తంగా పహారా కాశారు. ప్రమాద హెచ్చరికలు సూచిస్తూ అవగాహన కల్పించారు. సాయంత్రం వేళల్లో రోడ్డుకి ఇరువైపులా పార్కింగ్ నిర్వహణ లేకపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులు ఉల్లాసంగా... ఉత్సాహంగా సేదతీరారు. సుదూర ప్రాంతాల నుంచి మహిళలు, పిల్లలు, యువకులు సాగరతీరానికి చేరుకుని సందడి చేశారు. సముద్ర స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలతో పాటు ఒడిశాలోని పర్లాకిమిడి, గారబంద తదితర ప్రాంతాల నుంచీ పర్యాటకులు తరలివచ్చారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.


వజ్రపుకొత్తూరు : సందడి చేస్తున్న సందర్శకులు


సున్నాపురంలో...

అంతర పంటలపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో అర్జునవలస గ్రామంలో మొక్కజొన్నలో అంతర పంటల విధానంపై కోట్ల సీతారామ అనే రైతుతో 0.10 సెంట్లు స్థలంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, రైతులకు శిక్షణ ఇస్తూ ఆదివారం వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట మొక్కజొన్న వరుసకు వరుసకు 60 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు 20 సెంటీమీటర్లు నాటుకోవాలని, మధ్య విస్తీర్ణంలో బహుళ పంటలైన చిక్కుడు, బెండ, గోరుచిక్కుడు, ముల్లంగి, పాలకూర, గోంగూర, తోటకూర, పెసర, మినిములు వేసుకోవాలన్నారు. అలాగే ప్రధాన పొలం చుట్టూ రెండు లేదా మూడు వరసలు జొన్నలు లేదా సజ్జలు వేసుకోవాలన్నారు. ప్రధాన పొలం చుట్టూ అక్కడక్కడ తీగజాతులు కాకర, బీర, ఆనప పెట్టుకోవాలన్నారు. ఈ విధంగా బహుళపంటల పద్ధతులు వేయడం వలన పంటల వైవిధ్యత పెరిగి భూమిపైన మిత్ర కీటకాలు అభివృద్ధి చెందుతాయని, తద్వారా పురుగులను, తెగులును నివారించవచ్చును అలాగే భూమి లోపల పలు పంటల వేరు వ్యవస్థ ఉండటం వలన పలు రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలను వేరు వ్యవస్థ సహకారంతో అందించుకుంటాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్దింటి రాజేశ్వరి, సువ్వారి సన్యాసిరావు, కలివరపు శివశంకర్, గ్రామ ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న కృష్ణ


పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

22న సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి

ప్రజాశక్తి- పలాస

విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి వేడుకలు ఈ నెల 22న నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నీలకంఠం కోరారు. కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో ఆదివారం ప్రచారం నిర్వహించి పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరుణోదయ, ప్రజా కళామండలి కళాకారులు, పలు ప్రజా సంఘాల నాయకులు, విప్లవ రచయితలు, పాణిగ్రహణి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొవాలన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి నిర్మల, ఎఐకెఎంఎస్ నాయకులు తాండ్ర ప్రకాష్, గౌరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకులు పి.అరుణ, మణి, ప్రజా కళామండలి జిల్లా నాయకులు చిరంజీవులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న ధనుంజయరెడ్డి

ధనుంజయరెడ్డికి నంది అవార్డు

ఇచ్ఛాపురం : మండలంలోని టి.బరంపురం పంచాయతీ ఆల్ ఇండియా కళా రంగం ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ మెంబరు కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిప్పన ధనుంజయరెడ్డికి నంది అవార్డు పురస్కారం అందుకున్నారు. పండరి భజన, కోలాటం, హార్మోనియం కీబోర్డు కళాకారుడిగా పేరుకుంది. ఇందుకు గాను తెలంగాణ కల్చరల్ మెగా ఎంటర్ప్రైజెస్, రుద్ర ఈవెంట్ ఆర్గనైజింగ్‌లో సినిమా, టివి రంగాల ప్రముఖులు, ఫిల్మ్ యాక్టర్ సమీర్ చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో సినీ హీరో సుమన్, సమీర్, సరయు మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి పాల్గొన్నారు. అవార్డు అందుకున్న ధనుంజయరెడ్డికి ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి నారాయణమ్మ, మోహనరావు, వైసిపి మండల అధ్యక్షుడు పాతర్ల శేఖర్, సర్పంచ్ కారింగ్ త్రినాథ్‌రెడ్డి, కళాకారులు దేవరాజు, లక్ష్మణ్‌మూర్తి, చలపరాయి రవికుమార్, చలపరాయి వినోద, ధనవతి, రంగాల జానకిరామ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నూకరాజు నారాయణ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- కవిటి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి జె.తులసయ్య అన్నారు. మండలంలోని గొర్రెలపాడు పంచాయతీ కాజూరులో ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగుపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 సెంట్లు భూమిలో ఎటిఎం విధానంలో నాలుగు అడుగుల బెడ్ వేసుకుని, అందులో ఒక అడుగు వెడల్పు కాలువ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం దాంట్లో ఘన జీవామృతం వేసుకుని దుంపజాతి పంటలైన ముల్లంగి, కేరట్, బీట్రూట్, కూరగాయలైన టమాట, వంట, బెండ, చిక్కుడు తదితర పంటలతో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. దీనిపై ప్రయోగాత్మకంగా రైతులకు చూపించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు చిట్టి, స్వాతి, సంతోషి, జయమ్మ పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

కోటబొమ్మాళి: ప్రభుత్వం చేపడుతున్న జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. పంచాయతీ పరిధిలోని సీతన్నపేట, ఉప్పరపేట గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఇంటింటికీ మంచినీరు, డ్రెయినేజీలు, సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కార్యదర్శి అప్పారావు

మెళియాపుట్టిలో పారిశుధ్య పనులు

మెళియాపుట్టి : మెళియాపుట్టిలో ఆదివారం పారిశుధ్య పనులను కార్యదర్శి చింతల అప్పారావు ఆధ్వర్యాన చేపట్టారు. ఈ మేరకు చెత్తా చెదారాలను తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించారు. డ్రెయినేజీలు శుభ్రం చేసి బీచింగ్ వేయించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కపాసుకుద్దిలో అన్నదానం

కవిటి: మండలంలోని కపాసుకుద్దిలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివ స్వాముల దీక్షల విరమణ సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమ పూజలు, రుద్రాభిషేకంలో యాత్రికులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

మెళియాపుట్టి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర జాడుపల్లి, గంగరాజుపురం గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఇఒ తిరుపతి పట్నాయక్, రాఘవరావు, రమేష్, సర్పంచ్ ప్రతినిధి శంకరరావు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దానేష్

31న మహాసభ

ప్రజాశక్తి- పలాస

పౌరహక్కుల సంఘం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 31న శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో పౌరహక్కుల సంఘం మహాసభను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ అశ్రమం వద్ద ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌరహక్కుల హక్కుల సంఘం ప్రజల పక్షాల నిలిచి అనేక ఉద్యమాలను చేపట్టిందని అన్నారు. అణిచివేతకు గురవుతున్న పౌర హక్కులను కాపాడేందుకు అనేక రూపాల్లో పోరాటాలు చేపట్టిందన్నారు. రైతన్న, కార్మిక నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అనేక ఉద్యమాల్లో పాల్గొని గొంతు వినిపించిందన్నారు. విధ్వంసరక ప్రాజెక్టులకు వ్యతిరేకంగా, బావనపాడు పోర్టుకు వ్యతిరేకంగా అనేక రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచే సామాజిక బాధ్యతను పౌరహక్కుల సంఘం తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పిండి వెంకటరావు, సహాయ కార్యదర్శి సోమనాథం, కార్యవర్గ సభ్యులు వైకుంఠరావు, కృష్ణ, దానయ్య, ఢిల్లీరావు, మురళి, ధర్మారావు పాల్గొన్నారు.


రామాయణ, మహాభారతంపై వివరిస్తున్న హేమంత్‌కుమార్

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని, దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. హేమంత్ కుమార్ అనే విద్యార్థి మహాభారతంలో కర్ణుడు పాత్రపై విద్యార్థులకు తెలియజేశారు. రామాయణ, మహాభారతం ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని గ్రంథాలయాధికారి కోరారు. ఈ సందర్భంగా గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుందాం

ఆమదాలవలస: పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణ శివారులో సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో ముందుందామని వారందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయుటకు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుటకు రూ.లక్షతో తీర్మానం చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రోణంకి విజయభాస్కర్, వైద్యులు బివిఎస్ ప్రకాష్, డాక్టర్ సత్తారు కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు పైల శ్రీధర్, బొడ్డేపల్లి గన్నయ్య పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


ఎన్ఇఆర్‌ను కలిసిన గోపి శ్రీనివాస్

బిసి సాధికారిక సభకు సహకరించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

బిసి సాధికారిక చైతన్య సభ విజయవంతానికి సహకరించాలని విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్)ను రాష్ట్ర ఒబిసి అధ్యక్షులు రొంగళి గోపి శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఎచ్చెర్ల బిజెపి క్యాంప్ కార్యాలయంలో శ్రీనివాస్ ఎన్ఇఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జనవరి 7న విశాఖపట్నంలో చేపట్టనున్న బిసి సాధికారిక చైతన్యసభపై చర్చించారు. కార్యక్రమంలో బిజెపి ఒబిసి రాష్ట్ర సెక్రటరీ కంటుభుక్త శ్రీనివాస్, రాష్ట్ర ఒబిసి ఉపాధ్యక్షులు నాయుడు, రాష్ట్ర ఒబిసి కార్యవర్గ సభ్యులు యడ్ల రమణ రాజు పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభకు తరలిరావాలి

శ్రీకాకుళం అర్బన్: విజయనగరం జిల్లా భోగాపురం వద్ద ఈనెల 20న చేపట్టనున్న లోకేష్ యువగళం పాదయాత్రకు పెద్దసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకూర్మంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసేంతవరకు ప్రతి కార్యకర్త సైనికునిల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గిరి, మైగాపు ప్రభాకర్, గొండు వెంకట రమణమూర్తి, కొయ్యన జగదీష్, శిమ్మ శ్రీను, రెడ్డి గిరిజా శంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ గణపతిరావు

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలో ఓవర్ బ్రిడ్జి దిగువన ఉన్న సింధూర ధ్యాన మందిర్ (బైబిల్ మిషన్ చర్చ్) ఆవరణలో మున్సిపాలిటీ పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ రాడ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జీసస్ ఫర్ ఆల్ జనరేషన్ మినిస్ట్రీస్ అంతర్జాతీయ వర్తమానికులు డాక్టర్ కుమానుపల్లి కుమార్ రాజా ఇచ్చిన వర్తమానం సందేశం అందించారు. తహసిల్దార్ ఎం.గణపతిరావు కేక్‌కట్ చేశారు. కార్యక్రమానికి బ్రదర్ అసిర్ కుమార్, రెవరెండ్ శామ్యూల్, అరుణ్ కుమార్ అధ్యక్షత వహించారు. పాస్టర్ చంద్ర శేఖర్, సుజాత నూతన వస్త్రాలు పంపిణీ చేసారు. రాడ విజయ్ కుమార్, జార్జ్ ముల్లర్, కృపావరం, ఆనందరావు, శ్యామ్, రవీంద్రబాబు, శుభకర్, మెండా శ్రీను, సూర్యనారాయణ పాల్గొని ఘనంగా నిర్వహించారు.